
ప్రజాశక్తి

శనివారం 31 ఆగస్టు 2024

5

అల్లూరి సీతారామరాజు



చిరుత సంచారంతో భయాందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: రాజుపాక గ్రామంలో చిరుత సంచారంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గత 15 సంవత్సరాల నుండి చిరుత పులి జాడ గ్రామ అటవీ పరిసర ప్రాంతంలో ఆచూకీ లేదు. ఒక్కసారిగా పశువుల, మేకలపై గురువారం దాడికి పాల్పడింది. దీంతో ఆ గ్రామ గిరిజన ప్రజలు ఏ సమయంలో తమ పశువులు, మేకలపై దాడికి పాల్పడుతుందో అన్న భయాందోళనలతో బిక్కు బిక్కు మంటూ వాటికి కాపలా కాయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే నాలుగు మేకలను పులి హతమార్చిందన్నారు. ఫారెస్ట్ ఉన్నతాధికారులు చిరుతను బంధించి తమ పశువులు, మేకలను కాపాడాలని కోరారు.



గాయపడ్డ మేకకు చికిత్స చేస్తున్న సిబ్బంది

యుపిఎస్‌ను రద్దు చేయాలి

- యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-పాడేరు: యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వర్గాలు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, 2004 జనవరి 1 నుండి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004 సెప్టెంబర్ 1 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు చేస్తున్నాయన్నారు. ఉద్యోగుల పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టు తీర్పును పక్కనెట్టి గత 20 సంవత్సరాలుగా కాంట్రిబ్యూషన్ పెన్షన్ పథకం అమలు చేయడం అన్యాయమన్నారు. 2024 ఆగస్టు 22న కేంద్ర ప్రభుత్వ కేబినెట్ ఆమోదం తెలిపిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సూచన చేసిందని, పాత పెన్షన్ పథకంకు ఎక్కడా పోలిక లేదన్నారు. దీంతో, ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం లేదని జిల్లా సహ అధ్యక్షులు టీకేటి నాగేశ్వరరావు అన్నారు. పాత పెన్షన్ పథకాన్ని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తుంటే యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు రావడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు కే రాజారావు, ఎస్.గంగాధర్, యం. శ్రీను, ఎస్ రాజు, బి.ప్రవీణ్, కె.ఈశ్వర్ నాయుడు, ఎస్ చిరంజీవి, హేమంత్ లు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పాత పెన్షన్ పథకం తప్ప మరే పెన్షన్ స్కీమ్ వద్దని యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం అరకులోయ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు టి.చిట్టిబాబు మాట్లాడుతూ, సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు వుండే పాత పెన్షన్ కంటే మరేదీ అంగీకారం కాదని తెలిపారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని ముందుకు తీసుకు వచ్చిందని, దీనిని యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి దేముడు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ నారాయణ, మండల అధ్యక్షుడు టి.విజయ్, నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఎల్బి నాగేశ్వరరావు, ఎల్బి చంద్రశేఖర్, ఎల్బి రవి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

చింతూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫెయిడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చింతూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఈ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫెయిడ్ పెన్షన్ స్కీమ్ ఏ మాత్రం ఉద్యోగ , ఉపాధ్యాయులకు మేలు చేయదని తెలిపారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సైతం ఖాతరు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఐటిడిఏ సబ్ కమిటీ కన్వీనర్ యు.వెంకటనారాయణ, పి.కన్నారావు, జిల్లా కార్యదర్శి పి.కిష్టయ్య, బి.ముత్తయ్య, సోమరాజు, బ్రహ్మయ్య, జగదీష్, తులసి, గంగాదేవి, సుజాత, రాంబాబు, రాంకుమార్, అప్పారావు, రామకృష్ణ, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు



అకులోయలో నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నేతలు



చింతూరులో నినాదాలు చేస్తున్న నేతలు



గిరిజనుల నృత్యాలను తిలకిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గిరిజన గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలంలోని చావడికోట పంచాయతీ బంద, ఆకుమామిడికోట గ్రామాల్లో ఢిల్లీ నుంచి వచ్చిన ఎపి స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ పంచాయతీరాజ్ డైరెక్టర్ రామిట్ మౌర్య ఆధ్వర్యాన కేంద్రం బృందం శుక్రవారం పర్యటించింది. ముందుగా బంద గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. అటవీ ఉత్పత్తులైన కొండచీపురు, చింతపండు, జాబ్రాలు, బొబ్బర్లు, సామలు, వెదురు కొమ్ములు, చామకూర, గోంగూర వంటి వాటి గురించి పివిటిజి (కొండ రెడ్డి) గిరిజనులు ఆయనకు తెలియజేశారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, పెంపకం, వాటిని ఎక్కడ ఎవరికి విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల వ్యవసాయానికి ప్రోత్సహించాలని సంబంధిత వ్యవసాయ అధికారులను ఆయన కోరారు. ఎక్కువ దిగుబడులను ఇచ్చే పంటలను పండించుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆకుమామిడి కోట వారపు సంతను సందర్శించారు. ఆ గ్రామంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.సింహాచలం నిర్వహిస్తున్న పీఎం జన్మన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యుత్, రోడ్లు, తాగునీరు సౌకర్యం, డ్రైనేజీల ఏర్పాటు, కల్వర్టు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ రాఘవన్, డిఎల్‌డివో కోటేశ్వరరావు, ఎంపీడీవో ఏ.వీర కిషోర్, పరిపాలనాధికారి జయంతి, ఏపీవో రెడ్డి బాబు, ఈవోపీఆర్డి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3న అరకులోయలో జాబ్ మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పిఒ, జెసి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని అరకు లోయ మండల కేంద్రంలో సెప్టెంబర్ మూడున జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక గురుకుల కళాశాల ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, చింతూరు ఐటీడీఏ పిఓలు జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీ డా ప్ సంయుక్త ఆధ్వర్యంలో అరకు వేలి ఐటిఐ కాలేజీలో సెప్టెంబర్ 3న ఉదయం 10గంటల నుండి నిర్వహించనున్న ఈ జాబ్ మేళాను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, మోడరన్ వీర్ సెక్యూరిటి సర్వీసెస్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 30 ఏళ్ల మధ్య గల ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు పాన్ కార్డు, ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం 10,000 నుండి 20,000 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరములకు ఏపీ ఎస్ఎస్‌డిసి వెబ్సైట్ లేదా ఫోన్: 9177517373లో సంప్రదించాలన్నారు.

ఆదివాసీల పక్షం..ప్రజాశక్తి

-ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు
-వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం ప్రత్యేక అనుబంధ సంచికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం అన్ని వర్గాల ఆదివాసి ప్రజల సమస్యలను ఆవిష్కరిస్తూ గిరిజన సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రజాశక్తిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు మినుములు కన్నాపాత్రుడు, సూర్యనారాయణ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, సంతోష్‌కుమార్

ఆశ్రమ విద్యార్థినులను వేధించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మారేడుమిల్లి మండలం బోదులూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినీలను మానసికంగా వేధించిన, బెదిరింపులకు గురి చేసిన సిబ్బందిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని విధుల నుండి తొలగించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నత భవిష్యత్తు కోసం దేవాలయం లాంటి విద్యాలయానికి వచ్చిన విద్యార్థినులపై అక్కడ పనిచేసే సిబ్బంది ఇలాంటి వికృతి చేష్టలు చేయడం బాధాకరమన్నారు. అధికారులు విచారణకు వస్తే ఎవరూ చెప్పొద్దని, చెబితే గదిలో పెట్టి బంధించి కొడతామని బెదిరించడమంటే అక్కడ విద్యార్థులకు పూర్తిగా రక్షణ లేదని తెలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆశ్రమం పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు రక్షణ కల్పించడం కోసం రాత్రిపూట వాచ్మెన్‌లను, ఏఎన్ఎంలను నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, సోడి మల్లయ్య, గొంది ధారయ పాల్గొన్నారు.

వార్డెన్, ఎఎన్ఎం సస్పెన్షన్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం బొదులూరు బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఆ పాఠశాల ఏఎన్ఎం కొమరం రామలక్ష్మి, వార్డెన్ బి.మంగమ్మను సస్పెండ్ చేస్తున్నట్టు రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల చేత వెట్టి చాకిరీ చేయించినట్లు విచారణలో తేలడంతో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

పసికందు వైద్యానికి ప్రభుత్వ సహాయం

ప్రజాశక్తి-కూనవరం : ప్రాణాపాయ స్థితిలో ఉన్న పసికందు వైద్యానికి ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అందించారు. మండలంలోని కాచవరం గ్రామానికి చెందిన మేడి శ్రీనివాస్, శ్రీలత దంపతులకు ఈ నెల 22న బిడ్డ పుట్టాడు. పుట్టిన బాబు ఉమ్మనీరు మింగడంతో ప్రాణాపాయ స్థితిలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. బాబుకి వైద్యం నిమిత్తం రూ.ఐదు లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబ పరిస్థితి తెలిసిన టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్ ఇన్స్టాగ్రామ్ ద్వారా రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి తెలియజేశారు. వెంటనే ఆయన స్పందించి వైద్యం కోసం అయ్యే ఖర్చు ప్రభుత్వం ద్వారా మంజూరు చేశారు. దీంతో పసికందు తల్లిదండ్రులు శ్రీనివాస్, శ్రీలత లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏజెన్సీ డిఇఒ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఆశ్రమ బాలికల పాఠశాలను ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం ఎఫ్ఎ-1 పరీక్షలు ఎలా జరుగుతున్నాయో తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ప్రతి రోజూ సకాలంలో ఫేషియల్ హాజరు వేయాలని, విద్యార్థుల హాజరు 100శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్స్ డైరీలు రాయాలని, స్కూల్ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం మెనూ ప్రకారంగా అమలు చేయాలని, మరుగుదొడ్లు, వంటశాలలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని హెచ్‌ఎంకు సూచించారు.



ఎఫ్ఎ -1 పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు



వర్షంలో క్యూలో నిలుచున్న విద్యార్థులు

వర్షంలోనే భోజనాలు

-భోజనశాల లేక విద్యార్థుల అవస్థలు
-ఇదీ కిల్లోగుడ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వసతి గృహం దుస్థితి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వసతి గృహంలో భోజన శాల లేక పోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు భోజనాలు పట్టుకోవడానికి తీవ్ర తంటాలు పడాల్సిన పరిస్థితి వస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయంలో భారీ వర్షం కురిసింది. భోజన శాల లేక విద్యార్థులు ఆ వర్షంలో తలకు ప్లేట్లు అడ్డుగా పెట్టుకొని తడుస్తూ క్యూ లైన్‌లో నిలబడి భోజనాలు పెట్టుకున్న దృశ్యాలు ప్రజాశక్తి కెమెరా కంట పడింది. వర్షాకాలంలో నిత్యం ఇదే పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో భోజనశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఆర్‌టిసి డిపోలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 16 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ హాజరై ప్రారంభించారు. డిపో మేనేజర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై సంయుక్త కలెక్టర్ కొనియాడారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా శిబిరాన్ని సందర్శిం చారు.రక్తదానం చేసేందుకు అర్హులైన యువతి యువకులు ముందుకు రావాలని సూచించారు. అతి తక్కువ సమయంలో 16 యూనిట్ల రక్తాన్ని సేకరించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజీవ్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు జయలక్ష్మి, సూర్యారావు, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానంతో తాత్కాలిక కాజ్ వే ఏర్పాటు

- వర్షాకాలంలో వరద ఉధృతికి రాకపోకలకు అంతరాయం
- వంతెన నిర్మాణం చేయాలని నిమ్మచెట్టు గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామ సమీపంలో వాగుపై ఆ గ్రామస్తులు శ్రమదానంతో తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం చేసుకున్నారు. నిమ్మ చెట్టు గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై వంతెన లేక వర్షా కాలంలో ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. రాకపోకలు సాగించడానికి గతంలో వాగుపై తాత్కాలిక వంతెన నిర్మాణం చేసుకున్నారు. అయితే ఇటీవల ఇటీవల భారీ వర్షాలకు ఈ తాత్కాలిక వంతెనకొట్టుకుపోయింది. నీటి ప్రవాహానికి వంతెనకు అమర్చిన రాళ్లు దిగు ప్రాంతాన్ని కొట్టుకుపోయాయి. వాగు ఉధతంగా ప్రవహించడంతో రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు వాగు ఉధృతి తగ్గడంతో నిమ్మచెట్టు గ్రామస్తులు శ్రమదానంతో వాగుపై సిమెంటు తూరలు అమర్చి వాటిపైనా, చుట్టూ పెద్దపెద్ద రాళ్లు వేసి తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు గురు, శుక్రవారాల్లో యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఇదే వాగులో వరద ప్రవాహానికి గిరిజనులు కొట్టుకుపోయి మృత్యువాత గురైన సందర్భాలు ఉన్నాయి. వాగు ఉధృతి కారణంగా గిరిజనులు అనారోగ్యం పాలైతే వైద్య సేవలు పొందలేని దుస్థితి నెలకుంది. ఇప్పటికైనా అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి నిమ్మచెట్టు వాగుపై వంతెన నిర్మించి, రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శమదానంతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేస్తున్న నిమ్మచెట్టు గ్రామస్తులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు : సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి అచ్యుత్ తెలిపారు. జీకే వీధి మండలం రింతాడ జిటిడబ్ల్యూ స్కూల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో ఉన్న విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి మలేరియా టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థిలను అప్రమత్తం చేస్తూ మలేరియా పరీక్షలు నిర్వహించమని, ఎవరికి మలేరియా నిర్ధారణ కాలేదని తెలిపారు. వర్షాలు కురుస్తుండటంతో కొత్తనీరు చేరటం వలన వైరల్ ఇన్ఫెక్షన్స్, జ్వరాలు, దగ్గు, జలుబు, గొంతులోగరగర వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా వేడి నీటిని తాగాలన్నారు. ఎవరికైనా కొద్దిపాటి జ్వరం వచ్చినా ఆసుపత్రికి సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సింహాచలం, ఎంఎల్‌హెచ్‌పి నిర్మల లింగేశ్వరి, ఏఎన్ఎం కుమారి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆశ్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అచ్యుత్

వినాయక చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-అడ్డతీగల : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్లు, విగ్రహాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని అడ్డతీగల సిఐ నరసింహారావు, ఎస్సై అప్పలరాజు, వై.రామవరం ఎస్ఐ సంతోష్ కుమార్, గంగవరం ఎస్ఐ స్పష్టం చేశారు. విగ్రహాలు ఏర్పాటు చేసువారు కమిటీలుగా ఏర్పడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగిల్ విండో విధానం ఆన్లైన్ అప్లికేషన్ ద్వారా అనుమతి పొందవలసిందిగా ఉందని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగ నిర్వహించేందుకుగాను ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు.

కూనవరం : మండలంలో వినాయక చవితి ఉత్సవాలు బాధ్యతాయుతంగా జరపాలని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. ఉన్నత అధికారుల సూచన మేరకు విగ్రహాలు ఏర్పాటు చేసేవారు సింగిల్ విండో విధానంలో ఆన్లైన్‌లో అప్లై చేసి అనుమతి పొందాలని కోరారు. లౌడ్ స్పీకర్లతో రాత్రి పూట ఇబ్బంది కలిగించరాదని సూచించారు.

పాఠశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్నఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:మండలంలోని కొర్రాయి పంచాయతీ శాంతినగరంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పాఠశాల వద్ద మాట్లాడుతూ, శాంతినగరం గ్రామంలో బడిఈడు చిన్నారులు సుమారు 20మంది ఉన్నారన్నారు. చదువు కోవడానికి కిలోమీటరు దూరంలో ఉన్న కిల్లోగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారని తెలిపారు. ఆంధ్ర, ఒరిస్సా అంతరాష్ట్ర ప్రధాన జాతీయ రహదారిపై వర్షాకాలం, చలికాలంలో నిత్యం రద్దీగా ఉండే రహదారి నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొందని చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పుడు ఎమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శాంతి నగరంలో పాఠశాలను మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సద్దానందం, కె.రాము పాల్గొన్నారు.

గిరిజనేతరునిపై అట్రాసిటీ కేసు పెట్టాలి

ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల డిమాండ్



పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అమాయక గిరిజనులపై నకిలీ గిరిజనేతరుడు దాడి చేసిన కార్తీక రాజకిరణ్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.దాడిలో గాయపడి అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొర్ర చిట్టిబాబు, చిన్నమ్మలను ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు, కె.రామారావు పరామర్శించారు అనంతరం వారు మాట్లాడుతూ,కార్తీక రాజకిరణ్ గతంలో కూడా గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేసేవాడని, అరకులోయ పోలీస్ స్టేషన్ లో అతని పై అనేక కేసులు ఉన్నాయన్నారు. బంగ్లా వలస గిరిజనులను నకిలీ గిరిజనులు నుండి రక్షణ కల్పించాలని గతంలో గ్రామస్తులు పిర్యాదులు చేసినా అతని పై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పై గతంలో గ్రామస్తులు పిర్యాదు చేసిన రాజకిరణ్ కుటుంబ సభ్యులు తమ పలుకు బడి, ఆర్థిక అంగ బలంతో అమాయక గిరిజనులు పై లేని పోని కేసులు పెట్టి పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పించారన్నారు.గ్రామంలో పరిశుభ్రత కోసం స్వచ్ఛందంగా శుభ్రం చేసుకుంటున్న కొర్రా చిట్టి బాబు, కొర్రా చిన్నమ్మపై గొడ్డలితో దాడి చేసిన కార్తీక రాజకిరణ్, అతని కుటుంబ సభ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీలకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -పాడేరు:రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించనున్న క్విజ్ పోటీలకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎల్డిఎం పి.మాతు నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలకు 25 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. క్విజ్ లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విల్సియం మాట్లాడుతూ, డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలవాలని చెప్పారు. అనంతరం క్విజ్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గోరీ శంకర్, పలువురు లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం



పాడేరులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ దినేష్కుమార్

ప్రజాశక్తి-పాడేరు:మన భావితరాలు బాగుం డాలంటే మొక్కలు నాటాలని, అడవుల పెంపకంలో మనమందరం భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా కుమ్మరిపుట్టులోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ఆవరణలో స్థానిక శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరావుతో కలిసి మొక్కలు నాటారు. అనతరం నిర్వహించిన సభాను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, పోడు వ్యవసాయం, వంట చెరకు, తదితర కారణాలతో అడవులను కొట్టివేస్తే కొన్నాళ్ళకు భావి తరాలకు భవిష్యత్తు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.చెట్లను తిరిగి ప్రకృతికి అందించేందుకు విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రకతి పట్ల అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. అడవులు క్షీణించి పోవడంతో వాటిపై ఆడారపడ్డ జంతు జాలం, కీటకాలు, పక్షులు అంతరించి పోతాయని, తద్వారా జీవ వైవిధ్యం ఏర్పడి ఉష్ణోగ్రతలలో మార్పులు తలెత్తుతాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితులు రాకుండా ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, అడవులు అంతరించి పోవడంతో మనం వన్య ప్రాణులను కోల్పోతున్నామన్నారు. భవిష్యత్తులో అడవులను చూడాలంటే ఇప్పటి నుండే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు.సంయుక్త కలెక్టర్ డా.ఎం.జె అభిషేక్ మాట్లాడుతూ, హరితాంధ్రప్రదేశ్ మిషన్ లో భాగంగా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలని సూచించారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, చెట్టు నరకడంతో జీవ వైవిధ్యం దెబ్బ తిని, పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు.వన మహోత్సవ ప్రతిజ్ఞ చేసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఒక్క రోజు 35 వేల పైగా మొక్కలు నాటినట్లు డి.ఎఫ్.ఓ వినోద్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, డి.ఎఫ్.ఓ వినోద్ బాబు, డిఇఓ పి.బ్రహ్మాజీ, డిడి ఐ.కొండలరావు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రశాంత్, పలువురు జిల్లా అధికారులు చింతలవీధి సర్పంచ్ వి.సీతమ్మ, పాడేరు సర్పంచ్ కె.ఉషారాణి పాల్గొన్నారు.

పెదబయలు:.స్థానిక అటవీ శాఖ రేంజ్ అధికారులు ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక రెసిడెన్షియల్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిఐ రమేష్, ఎంపిడిఓ విగ్గేశ్, కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్.పురం :మండలంలోని రేఖపల్లిలో అటవీశాఖ, ఎఎస్డిఎస్, కార్యాలయాల్లో వన మహోత్సవం సందర్భంగా ఎంపిపి కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పిటిసి వాల్ల రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, సిపిఎం నేత పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామమూర్తి, నాళ్లారపు ప్రకాష్ రావు, కమ్మిసిచ్చు సత్యనారాయణ, హజరత్, టిడిపి, జనసేన నాయకులు నరేష్, ప్రకాష్రావు, సాయికృష్ణ, ఎఎస్డిఎస్ అధినేత గాంధీబాబు, అటవీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : వనమహోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్తు హైస్కూల్ ఆవరణలో 25 మొక్కలు నాటారు. ర్యాలీ నిర్వహించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అమల, చిన్నారెడ్డి, డిఎఫ్ఒ, టిడిపి కూటమి నాయకులు రాజు, చిట్టిబాబు, సామ్యూల్, హెచ్ఎం కె.బాలకృష్ణ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని దామనాపల్లి సర్పంచ్ కుంజేటి రామకృష్ణ పిలుపునిచ్చారు. జికె.వీధి మండలం దామనాపల్లిలో వన మహోత్సవం నిర్వహించారు. ఎన్ఆర్ఇజిఎస్ సభ్యులు పాల్గొన్నారు. జికె వీధి మండలం సీలేరు పాఠశాలలో హెచ్ఎం కిరణ్ కుమార్ ఆధ్వర్యాన జామ, ఉసిరి, మామిడి, దామంతి తదితర మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : వాతావరణం లో పెను మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక రేంజ్ అధికారి ఎం అబ్బాయి దొర, స్థానిక సీఐ సన్యాసినాయుడు అన్నారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ జి రమణి, ఎంపీటీసీ జి పెద్దిరాజు, ఎంపీడీవో లోకేశ యాదగిరి శ్వరరావు, ఎంఈఓ కె సత్యనారాయణదొర, డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ ఎం.శ్రీను, బి త్రిమూర్తులు, గణజాల తాతారావు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి నీల్ అర్మ్స్ట్రాంగ్ జిల్లా పరిషత్ హైస్కూల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ జాకబ్, పాఠశాల ఛైర్మన్ జి రవికుమార్, హెచ్ఎం నీలయ్య, టిడిపి నాయకులు గురుకుమార్, బీశెట్టి అప్పాజీ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వీరన్నదొర, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : అడ్డతీగల గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అడ్డతీగల డిఎఫ్ఒ రామారావు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, నినాదాలు, ప్రశంసా పత్రాలను అటవీ శాఖ అధికారులు అందించారు. పోలీస్ స్టేషన్లో అడ్డతీగల సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలోని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, అడ్డతీగల సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు సత్యనారాయణ, గొర్లె సాగర్, జర్ర వెంకటరమణారెడ్డి, చిట్యాల బాపన్నదొర, తాటికొండ రాజేంద్ర సహన్ పాల్గొన్నారు.

దేవీపట్నం : దేవీపట్నం మండలంలో ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో అటవీశాఖ రేంజ్ అధికారి దుర్గ కుమార్ బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి సిరసం సత్యవేణి, ఎంపీపీ కుంజం మురళి, టిడిపి కూటమి నాయకులు మరిపల్లి వెంకటేశ్వరరావు, మాగాపు బాబూరావు, చావా వెంకటసాయిరాయుడు, కట్టమూరి వీరబాబు, విద్యా కమిటీ చైర్మన్లు వీరభద్ర రామకృష్ణ, అరవింద్, కారం పోచమ్మ పాల్గొన్నారు.



పెదబయలులో అటవీశాఖ ఆధ్వర్యాన మొక్కలు నాటివేత



చింతూరులో మొక్కలు నాటుతున్న ఎంపిపి అమల



మారేడుమిల్లిలో అటవీశాఖ ఆధ్వర్యాన...



సీలేరులో మొక్కల నాటివేత

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -పెదబయలు :మండలంలో గలగండ గ్రామంలో శుక్రవారం స్థానిక ఇన్చార్జి ఎస్ఐ కుమార్ బాబు ఆధ్వర్యంలో చెడు వ్యసనాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నూతన సిఐ వెంకటరావు, ఇన్చార్జి ఎస్ఐ జి.కుమార్ బాబు మాట్లాడుతూ, చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్పీ ఉత్తర్వుల మేరకు స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు.



మాట్లాడుతున్న సిఐ వెంకటరావు

వితంతు పింఛన్ల మంజూరుకు వినతి

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని వంట్లమామిడి పంచాయతీ నందిగరువు గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజన మహిళలు తమకు వితంతు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పాడేరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో దరఖాస్తు చేసుకున్నారు. నందిగరువు గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజన మహిళల భర్తలు చనిపోయి మూడేళ్ల అవుతోందని, వీరికి పింఛన్లు మంజూరు చేయలేదని మాజీ సర్పంచ్ పాలికి లక్కు స్థానిక విలేకరులకు తెలిపారు. గత ప్రభుత్వంలో దరఖాస్తులు చేసుకున్నా పింఛన్లు జారీ కాలేదన్నారు. దీంతో వీరి కుటుంబాలు పోషణ భారంగా మారిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్ మంజూరు చేయాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న మహిళలు, లక్కు



దోమల మందు పిచికారీ చేయిస్తున్న ఎంపిపి లక్ష్మి, సర్పంచ్ సరోజిని

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెం కాలనీలో రెండవ విడత దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా పరిశుభ్రత పాటించకపోతే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదముందని తెలిపారు. దోమల నివారణకు గ్రామపంచాయతీ ద్వారా స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకత్వం పంకు సత్తిబాబు, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, పోడియం శ్రీరామమూర్తి, కమ్మసిచ్చు సత్యనారాయణ, నాలారపు ప్రకాష్ రావు, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిధులు దారిమళ్లించిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-విఆర్.పురం : 2019 నుండి 2024 వరకు పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఖర్చు పెట్టకుండా నాటి వైసిపి ప్రభుత్వం దారి మళ్ళించిందని టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంపై వైసిపి నేతలు అవాకులు చవాకులు మాట్లాడటం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా పూర్తి కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ నిర్వాసితుల సమస్యలపై లేదని వైసిపి నాయకులు మాట్లాడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. బురక కన్నారావు అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్ రావు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి పాయం రామారావు, మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, బూత్ కన్వీనర్ రేవు సింహాచలం, బొర్ర సూరి, బొర్రా ఆదినారాయణ, బింగి విష్ణుమూర్తి, మోదుగు వెంకన్నబాబు, ముత్యాల శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా వనమహోత్సవం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వన మహోత్సవ కార్యక్రమాన్ని రాజవొమ్మంగి మండలంలో అధికారులు మొక్కుబడిగా నిర్వహించారని జనసేన మండల అధ్యక్షులు బి.త్రిమూర్తులు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కార్యక్రమం జరిగే చోట కనీసం పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టలేదన్నారు. దీనిపై అటవీశాఖ అధికారి అబ్బాయి దొరను ఫోన్లో సంప్రదించగా స్టాఫ్ అందరూ జ్వరాలతో ఉన్నారని, వర్షం కారణంగా సరిగా చేయలేకపోయామని సమాధానం చెబుతూ మధ్యలోనే ఫోన్ కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

90 శాతం రాయితీపై రాజ్మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు : గిరిజన రైతులకు రాజ్మా విత్తనాలను 90శాతం సబ్సిడీపై పంపిణీ చేయడం జరిగిందని టిడిపి కూటమి నాయకులు ముట్టడం శరబన్న దొర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన రాజ్మా విత్తనాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వంలో విత్తనాలు దళారులకు అమ్ముకోవడం జరిగిందని ఆరోపించారు. ఇకనుంచి ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి గిరి రైతులకు రాదని పేర్కొన్నారు. దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపీపీ బి.కుమారి సర్పంచ్ లక్ష్మి, టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు కే .బాలరాజు పాండురాజు ఎస్. సంజీవరావు బి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ ప్రజా దర్బార్కు వినతుల వెల్లువ



లోకేష్కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా విశాఖలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తన రెండో రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకున్నారు. సమస్యల పరిష్కార వేదికైన 'ప్రజాదర్బార్'ను అక్కడే నిర్వహించి ప్రజల నుంచి నేరుగా విజ్ఞప్తులు స్వీకరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి వారితో కలిసి ఫొటోలు దిగారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ప్రేమించాలంటూ వెంటపడి, ఉన్మాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కొప్పుగొండుపాలెంకు చెందిన బద్ది వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న తమ కుమారుడిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారని, ఏం జరిగిందో ఇంతవరకు సమాచారం లేదని విశాఖకు చెందిన ఎ.అప్పలకొండ మంత్రి నారా లోకేష్ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. ఎలాగైనా తమ కుమారుడిని అమెరికా నుంచి దేశానికి తీసుకువచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేయడంతో పాటు చంపుతామని బెదిరిస్తున్నారని, తమ భూమిని కబ్జారాయుళ్ల నుంచి విడిపించడంతో పాటు ప్రాణరక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా బంగారయ్యపేటకు చెందిన మాతిరెడ్డి రాజునాయుడు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీర్సిటీ నాటకరంగ విభాగంలో అతిథి అధ్యాపకునిగా నియమించాలని గజపతినగరం నియోజకవర్గం కొత్తపాలెంకు చెందిన వి.త్రినాథరావు విజ్ఞప్తి చేశారు. కంప్యూటర్ సైన్స్లో డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని విశాఖకు చెందిన సనపాల మనోజ్ కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జిఒ 61ను అమలుచేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల విశ్వవిద్యాలయాలకు ఉత్తరాంధ్ర బిసి ఆచార్యులనే వైస్ ఛాన్సలర్లుగా నియమించాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ప్రతినిధులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు.

ఓర్పు, సహనంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కూటమి ప్రభుత్వం విజయం సాధించడంలో అందరి భాగస్వామ్యం ఉందని లోకేష్ అన్నారు. జివిఎంసి కార్పొరేటర్లతో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేటర్లు ఓర్పు, సహనంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సహజంగా కార్యకర్తలను విస్మరిస్తారని, అలా జరగకుండా చూడాలని అన్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించరూ..

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పింఛనుదారులకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాలు నిర్మించాలని రాష్ట్ర విద్య, ఐటి, గ్రంథాలయాల శాఖ మంత్రి నారా లోకేష్కు జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛన్దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.త్రిమూర్తులు, పి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కాకి అప్పారావులు వినతిపత్రం సమర్పించారు. గ్రంథాలయాల భవనాలు నిర్మించే పనిలోనే ఉన్నానని మంత్రి లోకేష్ అన్నారని మల్లేశ్వరరావు, త్రిమూర్తులు ఆ తర్వాత మీడియాకు తెలిపారు, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న గ్రంథాలయ ఉద్యోగుల, పింఛనుదారుల సమస్యల పరిష్కారం పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం ఎంపీ ఎం.శ్రీ భరత్కు, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజులకు సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

నేడు విశాఖలో రాజ్యసభ పిటిషన్ల కమిటీ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాజ్యసభ పిటిషన్ల కమిటీ తన స్టడీ విజిట్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకూ విశాఖ నగరంలో పర్యటించనుంది. దీనిలో భాగంగా కమిటీ సభ్యులు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, హిందుస్థాన్ షిప్యార్డ్, స్టీల్ప్లాంట్, ఎపి మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎపి ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంస్థల ప్రతినిధులతో పాటు పోర్టు, షిప్పింగ్ వాటర్ వేస్, స్టీల్, జల్శక్తి అధికారులతో ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5 గంటల వరకు మెడిటెక్ జోన్లో పర్యటించనున్నారు.

కెకె.లైన్లో రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారీ వర్షాల సూచన కారణంగా కొత్తవలస-కిరండూల్ లైన్లో నడిచే 18514 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్ప్రెస్ రైలు ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు దంతెవాడలో షార్ట్ టర్మినేట్ అవుతుంది. అలాగే 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్ప్రెస్ రైలు ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 1 వరకు దంతెవాడలో బయలుదేరి కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది.

'ఉక్కు' పరిరక్షణకు 1న ధర్నాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్ప్లాంట్ పరిరక్షణ కోసం సెప్టెంబర్ 1న సిఐటియు ఆధ్వర్యంలో విశాఖలోని అగనంపూడి ఎస్బిఐ జంక్షన్, వడ్లపూడి సచివాలయం, పెదగంట్యాడ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుండి ఒంటి గంట వరకు ధర్నాలు నిర్వహించనున్నట్టు స్టీల్ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తెలిపారు. స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1296వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందన్నారు.

ఈ క్రమంలోనే సెప్టెంబర్ 1న ఆందోళనలకు పిలుపునిచ్చామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ స్టీల్ప్లాంట్ ప్రజల సంపదని, కార్పొరేట్లకు అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉక్కు కర్మాగారం ఆవిర్భావానికి జరిగిన పోరాటాలను గుర్తుచేశారు. కేంద్రంపైనా, స్థానిక ఉక్కు యాజమాన్యం తీరుపైనా పోరాటాలు చేయడం ద్వారానే ప్లాంట్ను కాపాడుకోగలమన్నారు. దీక్షల్లో సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు బి.అప్పారావు, కె.గంగాధర్, టివికె.రాజు, పుల్లారావు, వి.మురళి, డి.సత్యనారాయణ, రమేష్, పిజికె.రాజు, మొహిద్దిన్, పవన్ పాల్గొన్నారు.

100 కిలోల చొప్పున రాజ్మా విత్తనాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : గిరి రైతులకు 100 కేజీలు చొప్పున రాజ్మా విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని జీకే వీధి మండలం ఏ.దారకొండ, గాలికొండ పంచాయితీకి చెందిన గిరిజనులు పి.బాలన్న ఎ.సన్యాసిరావు, పి.రాజబాబు, ఏ.సత్తిబాబు, బి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఒక్కొక్క రైతుకు 10 కేజీలు చొప్పున రాజ్మా విత్తనాలు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేసిందని, ఆ విత్తనాలు తమ వ్యవసాయానికి సరిపోవని తెలిపారు. ఒక్కో రైతుకు 300 కేజీల విత్తనాలు అవసరం కాగా 10 కేజీలు చొప్పున పంపిణీ చేయడం దారుణమన్నారు. గిరి రైతులపై దయవుంచి ప్రభుత్వం ఒక్కొక్క రైతుకి 100 కేజీలు చొప్పున రాజ్మా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు.

విద్యుదాఘాతానికి పాడిగేదె మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి గ్రామ సమీపంలోని శుక్రవారం విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతి చెందింది. జడ్డంగి గ్రామంలోని చిక్కాల చిన్న అనే నిరుపేద రైతుకు చెందిన పాడి గేదె రోజులానే మేతకు వెళ్ళింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తడితో ఉన్న 11 కేవీ విద్యుత్ వైరుకు ప్రమాదవశాత్తు తగిలి పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు చిన్న కోరారు. గేదె చనిపోయిన విషయం విద్యుత్ అధికారులకు తెలియజేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ కొంగర మురళీకర్రిష్ణ తెలిపారు. బాధిత రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆయన కోరారు.

ప్రమాదానికి గురైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సీలేరు : బైక్ ప్రమాదానికి గురైన వెంకట్రావు అనే వ్యక్తిని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆసుపత్రికి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. జీకే వీధి మండలం పెదవలస గ్రామంలో ఒక ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు బయలుదేరారు. ఆయన వెళ్తున్న మార్గంలో అసరాడ సమీపంలో లింగవరం గ్రామానికి చెందిన వెంకట్రావు దిశక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవస్తు బోల్తా కొట్టారు. ప్రమాదాన్ని చూసిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు వెంటనే తన వాహనాన్ని నిలిపివేసి అంబులెన్స్కి ఫోన్ చేసి రప్పించి అందులో వెంకటరావుని హాస్పిటల్కి తరలించారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న వెంకట్రావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పిఎం జన్మన్ సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : పివిటిజి గ్రామాల్లో పీఎం జన్మన్ హౌసింగ్ సర్వే వేగవంతం చేయాలని ఎపి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీకే వీధి మండల పరిధిలో పీఎం జన్ మన్ హౌసింగ్కి సంబంధించి అన్ని పంచాయతీల్లో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. హౌసింగ్ సర్వేలో ఆయా పంచాయతీ ప్రజలను భాగస్వాములు చేసి వారి సమస్యలు స్వయంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. పివిటీజీలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని కోరారు.

1న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎవిస్ ఓవర్సీస్ (ద్వారకానగర్) సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ - 2024 జరుగుతుందని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డిఎ.రాజు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్క్లబ్లో శుక్ర వారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం విశాఖ బీచ్ రోడ్లోగల పామ్ బీచ్ హోటల్లో ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జరుగుతుందని తెలిపారు. ఈ ఫెయిర్లో 15కి పైగా దేశాలు నుంచి టాప్ - 40 యూనివర్సిటీలు పాల్గొంటాయన్నారు. మీడియా సమావేశంలో సంస్థ మేనేజర్ బి.రవి తేజ, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ ఆర్.క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

నగర మార్కెట్లోకి ఫియోనా రిఫైన్డ్ ఆయిల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తాలూకా ఫియోనా రిఫైన్డ్ సన్ఫ్లవర్ ఆయిల్ను సినీ నటి లావణ్య త్రిపాఠి విశాఖ మార్కెట్లోకి శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీచ్రోడ్లోని గ్రాండ్ బే హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్లో పౌష్టికాహారానికి కీలకమైన విటమిన్ ఎ, డి, ఇలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు.